కొబ్బరి చెట్టు చిన్నగా నవ్వి జవాబు చెప్పింది.

"వేలకొద్దీ లతలు నాతో ఇదే మాటన్నాయి. గాలి తాకిడికి అవి వెళ్ళిపోయాయి. నేను మాత్రం బలంగా ఇక్కడే ఉన్నాను."

హిందూ సనాతన ధర్మం ఆ కొబ్బరి చెట్టు లాంటిది.

## 63. పనిముట్టు

ధ్యాన సాధనలో పడ్డ ఓ శిష్యుడు వేళకి తినక తన శరీరాన్ని నిర్లక్ష్యం చేయసాగాడు. అది తెలిసి గురువు శిష్యుడితో చెప్పాడు.

"నువ్వు అడవికి వెళ్ళి ఎవరికీ ఉపయోగపడని ఆకునొకదాన్ని తీసుకురా."

ఆ శిష్యుడు ఓ చెట్టు కింద రాలిన ఆకులని ఏరే ఆయుర్వేద వైద్యుడి భార్యని, ఇంధనంగా ఎండుటాకులని ఏరే ముసలావిడని, విస్తరి కుట్టడానికి ఆకులు ఏరే ఆమెని, వంటలోకి వాడటానికి... ఇలా అడవిలోని ప్రతి ఆకునీ ఏరేవాళ్ళని చూసి ఏదీ నిరుపయోగం కాదని తెలుసుకున్నాడు. తిరిగి వస్తూ, ఓ సరస్సులో తేలే ఆకుని తీసుకున్నాడు. కాని, దాని మీద రెండు చీమలుండి తమ ప్రాణాలని కాపాడుకున్నాయి.

శిష్యుడు గురువు దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"స్వామీ. అడవిలోని అన్ని ఆకులూ విలువైనవే. నిరుపయోగమైంది ఒక్కటీ లేదు."

"అడవిలోని ఆకులే విలువైనవయితే, నీ మానవ దేహం ఇంకా ఎంత విలువైందో తెలుసుకో. ఇది మోక్షాన్నిచ్చే పనిముట్టు. దాన్ని నువ్వు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం వుంది."

దాంతో శిష్యుడికి తన తప్పిదం తెలిసివచ్చి ఆ తర్వాత వేళకి ఆహారం తింటూ జాగ్రత్తగా జీవించసాగాడు.